కోల్‌కతా ఘటన అమానుషం

తుగ్గలి(పత్తికొండ) : కోల్‌కతాలో మెడికల్ కళాశాల విద్యార్థిని హత్యను నిరసిస్తూ సోమవారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థినులు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కాలేజీ నుంచి ర్యాలీగా వెళ్లి నాలుగు స్తంభాల కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రవేశపెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సరస్వతి,ఏటీఎల్ రెహానా,సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడకల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిని అత్యాచారం హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని కోరతూ సోమవారం ఆర్‌డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జూనియర్ కాలేజీ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారం చేపట్టారు. ప్రిన్సిపాల్ సబ్రహ్మణ్యం, ఆర్‌డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక జెడ్పీ పాఠశాల విద్యార్థినులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ సర్కిల్లో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటి సభ్యుడు రవి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులకు కఠినంగా శిక్షించాలని కోరారు.


పత్తికొండలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థినులు


చిప్పగిరి అంబేడ్కర్ కూడలిలో మానవ హారం నిర్వహిస్తున్న విద్యార్థులు

హాలహర్వి: వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి తిమ్మయ్య డిమాండ్ చేశారు.హత్యాచారం ఘటనను నిరసిస్తూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీహెచ్‌ఓ ఆదినారాయణ, స్టాఫ్ నర్స్ దుశాంత్, సూపర్‌వైజర్ సుగుణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హొళగుంద: ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌డీపీఐ ఆలూరు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహిమాన్ డిమాండ్ చేశారు. సోమవారం సుభాన్, హమీద్, హారూన్,భాషా, బక్షితో కలిసి విలేకరులతో మాట్లాడారు.


హాలహర్వి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్యులు, సిబ్బంది

రోడ్డు సమస్య పరిష్కరించండి

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామ పంచాయతీ సమీపంలో సీసీ రోడ్డు నిర్మించి మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామ లింగాయతీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ అల్లబకష్‌కు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఉరుకుందప్ప, గ్రామస్తులు వీరేంద్ర, చంద్రశేఖర్, గోవిందరాజులు, జయదేవ్ స్వామి, శరణ స్వామి,సిద్ధరామ్ గౌడ్ ఉన్నారు.

డ్రైనేజీలు నిర్మించండి

హొళగుంద : ఇంగళదహాళ్ గ్రామంలోని బీసీ కాలనీలో వృథా నీరు, వర్షపు నీరు బయటకు వెళ్లడానికి మార్గం లేక కాలనీ బురదకుంట మారుతోందని, వెంటనే సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు సోమవారం కోరారు.

ప్రయాణికుల కష్టాలు తీర్చండి

ఆలూరు: పత్తికొండ మండలంలోని హోసూరు, మొలగవెల్లి గ్రామాల మధ్య బ్రిడ్జీ నిర్మించాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మొలగవెల్లి, ఎం.కొట్టాల గ్రామాల సర్పంచ్‌లు మోహన్‌రాజ్, రాజశేఖర్, మండల సీపీఐ కార్యాదర్శి రామాంజనేయులు తదితరులు రైతులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు.

క్లుప్తంగా

వరుణుడి కోసం..


నంచర్లలో శివలింగానికి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: వరుణుడి రాక కోసం మండలంలోని నంచర్ల గ్రామంలో వెలసిన రామలింగయ్య ఆలయంలోని శివలింగానికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం 101 బిందెలతో నీళ్లు తెచ్చి అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వందలాదిగ తరలివచ్చిన భక్తలకు అన్నదానం చేశారు. గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కరిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు.

గృహ నిర్మాణాల పరిశీలన

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలోని ఇళ్ళ నిర్మాణాల పురోగతిని ఇంజనీరింగ్ అసిస్టెంట్ భారతి సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిని బట్టి ప్రస్తుత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి సత్వరమే ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు సంబంధించి డిసెంబర్ వరకే బిల్లులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్ధంతి

తుగ్గలి : మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి వర్ధంతిని సోమవారం తుగ్గలిలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తుగ్గలి(పత్తికొండ) : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, గౌరవ అధ్యక్షులు మాదన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

తుగ్గలి : స్థానిక ఏఎస్ జూనియర్ కాలేజీలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా సోమవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. సంస్థ జోనల్ సూపర్ వైజర్ రామాంజనేయులు మాట్లాడుతూ అక్టోబర్ 12వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆలయానికి ఇన్వర్టర్ అందజేత

మద్దికెర: స్థానిక చౌడేశ్వరి దేవాలయానికి రూ. 25 వేల విలువజేసే ఇన్వర్టర్‌ను బాణా ఈరన్న, అంజనయ్య కుమారులు విరాళంగా అందజేసినట్లు ఆలయ ధర్మకర్త పెద్దకోట్ల రమేష్ సోమవారం తెలిపారు. దాతలు బాణా ఎర్రిస్వామి, అర్చకులు ఆంజనేయులు, కమిటీ సభ్యులు పల్లా వెంకటప్ప పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి

హొళగుంద: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీన తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా కార్యదర్శి హెబ్బటం వన్నూరప్ప కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల మహానాడు, లోక్ జనశక్తి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా,బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

వెల్దుర్తి: గత 13 రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీ గ్రామసభలు సోమవారంతో ముగిశాయని ఏపీఓ రాజునాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మిద్దె రంగయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సోమవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ఆలయంలో మోటార్ చోరీ

దేవనకొండ: స్థానిక విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నీటి మోటార్‌ను దుండగులు సోమవారం చోరీ చేశారు. భక్తాదుల సౌకర్యార్థం 2013-14లో పారామిలిటరీ సిబ్బంది సిద్దప్ప, కృష్ణమూర్తి, మధుసూదన్, ఓంకార్ కలిసి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి నీటి బోరు ఏర్పాటు చేయించారు. మోటార్ లేకపోవడంతో నీటి కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

వెల్దుర్తి: గ్రామాల్లో దళితుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ కోరారు. సోమవారం నూతన ఎస్ఐ జి.అశోక్‌ను కలిసి సన్మానించిన అనంతరం వారు మాట్లాడుతూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. టైలర్ రాముడు, రామగిడ్డయ్య, టైలర్ కృష్ణ, దానియేలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

హాలహర్వి: తహసీల్దార్ నజ్మాబానును సోమవారం వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామిరెడ్డి, మండల కో-కన్వీనర్ మల్లికార్జున, మండల యూత్ అధ్యక్షుడు గంగాధర కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్‌ను కోరారు. నాయకులు సుంకన్న, గోపాల్, ఈశ్వర్, వన్నూరప్ప, గోవింద ఉన్నారు.

పంటలకు సాగునీరివ్వండి

దేవనకొండ: మండలంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సాగునీరు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, రైతు సంఘం నాయకుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. అధికారులు మాత్రం మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం లేదన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అశోక్, యూసుఫ్‌బాషా, లక్ష్మిరెడ్డి, సుంకన్న, జయరాముడు, మహేంద్ర జయన్న పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం జమ చేయాలి

తుగ్గలి : గతేడాది రబీలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం జమ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, ఏపీ రైతు సంఘం కార్యదర్శి కొండారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. రబీలో తీవ్ర వర్షాభావంతో పంట నష్ట పోవడంతో ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని అయినా ఇంత వరకు రైతులకు పరిహారం జమ చేయలేదన్నారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

కందిలో యాజమాన్య పద్ధతులు చేపట్టండి

మద్దికెర : వారం రోజులుగా మండలంలో సమృద్ధిగా వర్షాలు కురిశాయని, ఈ వానలు పంటల పెరుగుదలకు దోహదపడతాయని ఏఓ రవి తెలిపారు. సోమవారం మండల కేంద్రం సమీపంలో సాగైన కంది పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కంది పంట ప్రస్తుతం 50-70 రోజుల దశలో ఉందని, రైతులు 20-25 కిలోల (20-20-0-13) , 15 కిలోల పొటాష్ వేసుకుటే పంట పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. అలాగే కందిలో పిండినల్లి ఆశించిన మొక్కలపై మజ్జిగలాంటి మచ్చలు ఏర్పడుతాయన్నారు. నివారణకు ఎకరాకు సాఫినోఫాస్ (కురక్రాన్) 400 మి.లీ పిచికారీ చేయాలని చెప్పారు. తెగులు ఉంటే ఎకరాకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (సీ.ఓ.ఓ)500 మి.లీ మొక్క పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

గాయపడిన మహిళ మృతి

ఆస్పరి: మండలంలోని తండరడోణ గ్రామంలో ఈనెల 15న చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల్లో బాణాసంచా పేలి గాయపడిన గోవిందమ్మ (51 రాయచూర్ ప్రభుత్వ ఆస్పతిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపారు. ఈమె స్వగ్రామం కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా మంచాలపురం గ్రామమని చెప్పారు.

గరుడ వాహనంపై రంగనాథుడు


గరుడ వాహనంపై దేవేరులతో కలిసి విహరిస్తున్న రంగనాథస్వామి

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో కొలువైన రంగనాథ స్వామి వారు సతీసమేతుడై సోమవారం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. శ్రావణమాస పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో బిందెసేవ, అష్టోత్తర నామార్చన అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు.

మద్దికెర ఎస్ఐగా విజయ్‌శంకర్ నాయక్



మద్దికెర: ఎస్ఐగా విజయ్‌శంకర్ నాయక్ సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న రమేష్‌బాబు చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. చిత్తూరు జిల్లాలోని బాకరాపేటలో విధులు నిర్వహిస్తున్న ఈయనను ఇక్కడికి పంపారు.

బాధ్యతలు స్వీకరించిన తుగ్గలి ఎస్ఐ

తుగ్గలి: మండల ఎస్ఐగా జి. కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఇది వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్ఐ మల్లికార్జున కర్నూలుకు వెళ్లారు. ఆయన స్థానంలో మాధవవరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తిని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు.

కృష్ణగిరి ఎస్ఐగా మల్లికార్జున



కృష్ణగిరి: మండల నూతన ఎస్ఐగా కె.మల్లికార్జున సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి పని చేస్తున్న ఖాజావలి కర్నూలుకు బదిలీకాగా ఆయన స్థానంలో నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు నుంచి ఈయన ఇక్కడికి వచ్చారు.

పత్తికొండ రూరల్ సీఐగా పులిశేఖర్‌గౌడ్



తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ రూరల్ సీఐగా పులిశేఖర్ గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

తుంగభద్ర జలాలతో అభిషేకం

ఆస్పరి: వర్షాలు సమృద్ధిగి కురిసి పంటలు బాగా పండాలని తుంగభద్ర నుంచి తెచ్చిన జలాలతో మండలంలోని హలిగేర గ్రామంలో సోమవారం ఆంజనేయ, ఈశ్వరస్వామి, పెద్దమ్మవ్వ, సుంకులమ్మ, బంగారమ్మ ఆలయాల్లో మూలమూర్తులకు జలాభిషేకం చేశారు. అలాగే.. మండలంలోని శంకరబండలో వర్షం కోసం శరణ బసప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో శరుణ బసప్ప చిత్ర పటాన్ని మేళతాళాలతో ఊరేగించారు.


ఆస్పరిప్రైవేట్ స్కూల్లో సోదరులకు రాఖీ కడుతున్న దృశ్యం


హొళగుందలో రాఖీ కడ్తున్న బ్రహ్మకుమారి

సంతోషాల రాఖీ

కృష్ణగిరి: నాకు నువ్వు రక్ష, నీకు నేను రక్ష అన్న సంకేతాన్ని చాటి చెప్పేలా రాఖీ పండుగను ప్రతి ఏడాది శ్రావణమాస పౌర్ణమి రోజున ఘనంగా జరుపుకుంటారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పండుగ సంరద్భంగా తోబుట్టువులకు రాఖీ కట్టి తమ అనురాగాన్ని చాటుకున్నారు. మానవ సంబంధాలు, అనుబంధాలకు ప్రతీకగా నిలిచేలా, అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా పండుగను జరుపుకున్నారు.

హొళగుంద: మండలంలో సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా చేసుకున్నారు. అన్న చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా చేసుకునే ఈ పండుగను పల్లెలతో పాటు మండల కేంద్రంలో సంబరంగా చేసుకున్నారు. చెల్లెళ్లు, అక్కలు అన్నదమ్ములకు రాఖీలు కట్టి కలకాలం కలిసి మెలిసి ఉందామని ఆకాంక్షించారు. అంతకు ముందు ఇళ్లల్లో, ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మకుమారి భాగ్యలక్ష్మి మహిళలతో కలిసి గ్రామంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో పలువురికి రాఖీ కట్టారు.

ఆస్పరి: స్థానిక మారెమ్మవ్వ, రామతీర్థంలోని రాయత్రీ మాత, రామలింగేశ్వర స్వామి, శంకరబండలో లింగమేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. అలాగే..నారాయణ ప్రైమ్ ప్రైవేట్ స్కూల్లో సోమవారం రాఖీ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్లో తమ్ముళ్లకు అక్కలు రాఖీ కట్టారు.


సీఐ జయన్నకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

మద్దికెర : అన్నా చెల్లెల అనురాగానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్ సందర్భంగా మండలంలో సోమవారం సోదరులకు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

తుగ్గలి(పత్తికొండ): రక్షాబంధన్ వేడుకలను సోమవారం పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పత్తికొండలో ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ భవన్ నిర్వాహకులు శ్రీలక్ష్మి, సభ్యురాళ్లు సీఐ జయన్న, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బందికి, సబ్ జైలులో జైలు అధికారి చంద్రమోహన్, ఖైదీలకు రాఖీ కట్టి ఆశీస్సులు అందుకున్నారు. సీఐ, సబ్ జైలు అధికారి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి


బోయ లక్ష్మిదేవి (ఫైల్)

మద్దికెర: ఎండలకు తాళలేక వడదెబ్బకు గురై మహిళ మృతి చెందింది. వివరాలు.. మండల కేంద్రంలోని కురువ వీధిలో నివశిస్తున్న బోయ లక్ష్మిదేవి (58) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగానే సోమవారం పొలానికి కూలీకి వెళ్లింది. ఎండలు విపరీతంగా ఉండడంతో అలసటగా ఉందని తోటి కూలీలకు చెప్పడంతో వారు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అంతలోనే కుప్పకూలడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వడదెబ్బకు గురై మృతి చెందినట్లు ధ్రువీకరించారని కూలీలు తెలిపారు. మృతురాలికి కుమారుడు ఉన్నారు.

వైభవంగా బసవేశ్వర ఉత్సవాలు

మద్దికెర : శ్రావణమాసం సందర్భంగా నెల రోజుల పాటు బసవేశ్వర దేవాలయంలో బసవేశ్వరస్వామికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేపట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా గ్రామానికి 4 కి.మీ దూరంలోనున్న బుగ్గ సంగమేశ్వరం నుంచి ఎద్దుల బండ్లు, కలశాలతో నీటిని తీసుకొని స్వామి వారికి జలాభిషేకం చేస్తూ , పురవీధుల్లో నందికోలు ఆడుతూ సంగం దేవర చేసిన విన్యాసాలు అలంరించాయి.

సాగుదారుడి పేరునే పంట నమోదు

వెల్దుర్తి: కౌలుపై పంటసాగు చేస్తున్న కౌలు రైతుల పేరు మీదుగానే పంట నమోదు చేయాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ ఆదేశించారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఏఓ అక్బర్‌బాషాతో కలిసి రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో పంట నమోదుపై సమావేశం నిర్వహించారు. కొన్నేళ్లుగా బీడుగా ఉన్న పొలాల వివరాలను సేకరించి వ్యవసాయ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కోరారు.

తెరుచుకున్న మొలగవల్లి ఆసుపత్రి

ఆలూరు రూరల్: మొలగవల్లి పీహెచ్‌సీ తాళాలు తెరుచుకున్నాయి. ఆదివారం ప్రచురితమైన ఆసుపత్రికి తాళం అందని వైద్యం..అనే సాక్షి కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఆదివారం ఆస్పత్రికి తాళం వేయడంతో సీపీఐ జిల్లా నాయకులు భూపేష్ ఆధ్వర్యంలో మొలగవల్లి గ్రామస్తులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించి ఆసుపత్రి సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించడంతో సోమవారం నుంచి ఆసుపత్రిలో పీహెచ్‌సీ సిబ్బంది విధులకు హాజరయ్యారు. పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మన్‌ను నియమించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు రాతపూర్వకంగా తెలియజేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాఘురామి రెడ్డి తెలిపారు.



రమణీయం.. కుంభోత్సవం

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామంలో శ్రావణమాసం మూడవ సోమవారంలో భాగంగా వీరభద్రేశ్వరస్వామి కుంభోత్సవ కార్యక్రమం అత్యంత రమణీయంగా జరిగింది. కొండ దిగువన ఉన్న పెద్దహ్యాట స్వామి వారి నామస్మరణంతో మారుమ్రోగింది. ఏటా జరిగే ఈ కార్యక్రమానికి స్థానికులే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. తమ ఇలవేల్పు వీరభద్రుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున గ్రామ శివారులో గంగ పూజా, కుంభాల ఊరేగింపు, వీరభద్రుని వేషధారుడి వీరకాసి దైవ వచనాలు, నందికోలు ఆడించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామి వారి ఆలయంలో రుద్రాభిషేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి, పంటలతో గ్రామం కళకళలాడాలని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.


కుంభోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని..


డి.కోటకొండ ప్రధాన రహదారిపై పిచ్చి మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని డి.కోటకొండ గ్రామ ప్రధాన వీధిలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు, గ్రామస్తులు వర్షపు నీటిలో సోమవారం పిచ్చి మొక్కలు నాటి నిరసన తెలిపారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్, సీపీఐ గ్రామ కార్యదర్శి బడెసహెబ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధిలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు నీరునిలిచి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షం కురిసినప్పుడు వర్షపునీరు ఇళ్లలోకి వస్తుందన్నారు. కూటిమి నాయకులు ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారే కానీ.. ఇప్పటి వరకు గ్రామం వైపు చూడలేదని విమర్శించారు. గ్రామ మహిళలు, నాయకులు మల్లన్న, రామాంజిని, రాజా, రామలక్ష్మి, ఉశేన్‌బీ, రసూలమ్మ, రజాక్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు

● నేటి నుంచి ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే

ఆలూరు రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టి 18 ఏళ్లు నిండిన యువతీ,యువకులకు ఓటు హక్కు కల్పిస్తామని ఆలూరు తహసీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి 1నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకునే యువతీ,యువకులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో కొత్త ఓటరు చేర్పులు, ఫోటో మార్పు,పోలింగ్ కేంద్రాల మార్పుల ఫారాలను స్వీకరిస్తారన్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేది వరకు స్వీకరించిన 1 నుంచి 8 ఫారాలను పరిశీలిస్తారన్నారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రదర్శన, దరఖాస్తు ఫారాల అమోదం,తిరస్కరణ ఉంటుందని చెప్పారు. ప్రతి శని, ఆది వారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని వివరించారు. జనవరి 1న ఓటరు జాబితా ముద్రణ, 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తామని వెల్లడించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దాం

దేవనకొండ: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ఇటీవల సంభవించిన వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు ప్రజలంతా అండగా నిలవాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేందంర్రో వారి కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. పార్టీ జిల్లా నాయకుడు వీరశేఖర్ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాషా, అశోక్, మహబూబ్‌బాషా, సూరి, సీనియర్ నాయకులు బజారి, లక్ష్మిరెడ్డి, వై.పెద్దయ్య నాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణగిరిలో భారీ వర్షం

కృష్ణగిరి: వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు భారీ వర్షంతో ఉపశమనం లభించింది. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. దీంతో కృష్ణగిరిలోని కొన్ని కాలనీల్లో మోకాలు లోతు వర్షపు నీరు పారింది. అలాగే పలు గ్రామాల్లోని పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. వాగులు, వంకలు పొంగాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ వర్షంతో జీవం వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ బోరు, బావుల కింద సాగుచేసి పంట నూర్పిళ్లు చేస్తున్న వేరుశనగ ఉత్పత్తులు వర్షానికి తడిచాయి.


కృష్ణగిరిలోని ఓ వీధిలో పారుతున్న వర్షపునీరు

బల్గోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హాలహర్వి: విరుపాపురం గ్రామంలో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా బల్గోటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయ పూజారి బసవరాజుస్వామి భవిష్యవాణి చెప్పారు. ఈ యేడాది వర్షాలు బాగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని భవిష్యవాణి వినిపించారు.


భవిష్యవాణి వినిపిస్తున్న బసవరాజు స్వామి

దరఖాస్తుల ఆహ్వానం

ఆస్పరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, అభ్యర్థు లు దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోపు కళాశాల లో అందజేయాలని సూచించారు. వివరాలకు సెల్ 9985197739నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మాలలు ఐక్యంగా పోరాటం చేయాలి

ఆస్పరి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాలలు ఐక్యమత్యంతో పోరాటాలు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరాం, జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కైరుప్పల గ్రామంలో మాల మహానాడు నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను దెబ్బతీసేలా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం విచారకరమన్నారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపడుతున్న ఆందోళనలో పాల్గొనాలని కోరారు. నారాయణస్వామి, రామాంజినేయులు, శ్రీనివాసులు, చిన్న వీరన్న పాల్గొన్నారు.